
నేటి దినపత్రిక సూర్య www.suryaa.com




EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
గురువారం
27 జూన్ 2024
పేజీలు: 02


సెమీ ఫైనల్-2
ఇండియా vs ఇంగ్లండ్
నేడు 8.00 రాత్రి

# కల్కి 2898 ఏడీ రివ్యూ



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'కల్కి 2898 ఏడీ'. భారతీయ సినీ పరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ చిత్రం ఈ రోజు భారీ అంచనాల మధ్య భారీ స్థాయిలో రిలీజ్ అయింది. భవిష్యత్ లో ప్రపంచమంతా వనరులను కోల్పోయిన నిర్జీవమైన దశలో కాశీ పట్టణం ఒక్కటి మాత్రమే ఉంటుంది. అక్కడ సుప్రీం యాస్కిన్ (కమల్‌హాసన్) కాంప్లెక్స్ అనే వండర్ ఫుల్ లోకాన్ని క్రియేట్ చేసుకుని ఆ ప్రాంతాన్ని లీడ్ చేస్తాడు. కాంప్లెక్స్ కింద భూమి మీద ప్రజలు కష్ట పడుతూ బాధలతో బతుకుతూ ఉంటారు. దీంతో అక్కడే ఉండే భైరవ (ప్రభాస్)కి కాంప్లెక్స్ లోకి వెళ్లి బతకాలని బలమైన కోరిక ఉంటుంది. దానికోసం భైరవ రకరకాల ప్రయత్నాలు చేస్తుంటాడు. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో మళ్లీ 6000 వేల సంవత్సరాల తర్వాత కల్కి (దేవుడు) రాబోతున్నాడని సుప్రీం యాస్కిన్ మనుషులకు అర్థం అవుతుంది. దీంతో సుమతి (దీపికా పదుకొనే) కడుపులోని దేవుడ్ని కాపాడటానికి అశ్వత్థామ (అమితాబ్ బచ్చన్) వస్తాడు. దానికి భైరవ అడ్డు పడుతూ ఉంటాడు. మరి ఈ క్రమంలో జరిగిన సంఘటనలు ఏమిటి ?, అసలు భైరవ ఎవరు ?, ఇంతకీ, సుప్రీం యాస్కిన్ మోటివ్ ఏమిటి ?, చివరకి సుమతిని అశ్వత్థామ సేవ్ చేశాడా? లేదా ? అనేది మిగిలిన కథ. ఈ చిత్రం పురాణాలను భవిష్యత్‌ను కలుపుతూ అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందించబడటం, అలాగే ప్రభాస్, అమితాబ్ తో పాటు మిగిలిన అగ్ర నటీనటుల నటన, అద్భుతమైన విజువల్స్, అత్యాధునిక వీఎఫ్ఎక్స్ మరియు భారీ యాక్షన్ ఎపిసోడ్స్ వంటి అంశాలు ఈ సినిమాలో స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచాయి.

అశ్వత్థామగా అమితాబ్ బచ్చన్, సుప్రీం యాస్కిన్‌గా కమల్‌హాసన్ తమ పాత్రల్లో జీవించారు. దాదాపు 40ఏళ్ల విరామం తర్వాత వీరిద్దరూ కలిసి ఒకే సినిమాలో కనిపించడం ఈ సినిమాకి మరో ప్లస్ పాయింట్. ముఖ్యంగా కమల్ హాసన్ సుప్రీం యాస్కిన్ పాత్ర లుక్ చాలా బాగుంది. అదేవిధంగా 81 సంవత్సరాల వయసులో కూడా అశ్వత్థామ పాత్రలో అమితాబ్ తన యాక్షన్ తో అదరగొట్టారు. ఇక భైరవ పాత్రలోని షేడ్స్ ను ప్రభాస్ చాలా బాగా పలికించాడు. ప్రభాస్ – అమితాబ్ మధ్య సాగే యాక్షన్ సీక్వెన్సెస్ కూడా చాలా బాగున్నాయి. తన పాత్రకు ప్రభాస్ ప్రాణం పోశారు. మొత్తానికి ప్రభాస్ తన లుక్స్ అండ్ యాక్షన్ తో ఈ సినిమాకి హైలైట్ గా నిలిచాడు. దీపికా పదుకొనేకి చాలా మంచి పాత్ర దొరికింది. ఆమె భగవంతుడ్ని కనే అమ్మగా అలరించింది. నటి శోభన తన పాత్రలో మెరిశారు. మరో కీలక పాత్రలో రాజేంద్ర ప్రసాద్ కూడా చాలా బాగా నటించాడు. అలాగే, దిశా పటానీ, పశుపతి, అన్నా బెన్ లతో పాటు మిగిలిన నటీనటులు కూడా తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. ఈ 'కల్కి' కథ మూడు ప్రపంచాల మధ్య సాగుతుంది. పైగా భవిష్యత్ లో ప్రపంచమంతా వనరులను కోల్పోయిన నిర్జీవమైన దశలో కాశీ పట్టణాన్ని చూపించిన విధానం కూడా చాలా ఆలోచనాత్మకంగా ఉంది. అదే విధంగా సర్వమత శరణార్థులు ఉండే ప్రాంతంగా శంబాలను చూపించిన విధానం కూడా చాలా బాగుంది. ఇక అన్ని వనరులు కలిగి ఆకాశంలో కిలోమీటర మేర ఉండేలా కాంప్లెక్స్‌ను వండర్ ఫుల్ గా డిజైన్ చేశారు. మొత్తానికి గుడ్ క్లైమాక్స్ తో పాటు ప్రతి నేపథ్యాన్ని, ప్రతి పాత్రను దర్శకుడు నాగ్ అశ్విన్ చాలా బాగా తీర్చిదిద్దారు. 'కల్కి 2898 ఏడీ' కథా నేపథ్యంలో డెప్త్ ఉన్నా.. ఫస్ట్ హాఫ్ లో కొన్ని సన్నివేశాలు స్లొగా సాగుతాయి. అలాగే మెయిన్ ప్లాట్ లోని మెయిన్ క్యారెక్టర్స్ మధ్య ప్రధాన కాన్ ఫ్లిక్ట్ ను ఇంకా బాగా ఎస్టాబ్లిష్ చేయాల్సింది. అలాగే కొన్ని ఇన్సిడెంట్స్ మరీ సినిమాటిక్ గా అనిపిస్తాయి. శంబాల రెబల్స్ రేపటి కోసం చేస్తున్న యుద్ధంలోని ఎమోషన్స్ ను ఇంకా బలంగా చూపించి ఉంటే బాగుండేది. అదేవిధంగా భైరవ పాత్రను క్లైమాక్స్ లో చూపించిన విధంగా ఫస్ట్ హాఫ్ లో కూడా కొన్ని ఎలివేషన్స్ పెట్టి ఉంటే బాగుండేది. టెక్నికల్ గా చూసుకుంటే సినిమాలో సాంకేతిక విభాగం వర్క్ చాలా బాగుంది. సంతోష్ నారాయణన్ సంగీతం సినిమాకు ప్లస్ అయ్యింది. అదే విధంగా జోర్డ్జే స్టోజిల్జ్కోవిచ్ సినిమాటోగ్రఫీ సినిమాకే హైలెట్ గా నిలుస్తోంది. కొన్ని కీలక సన్నివేశాల్లో కెమెరామెన్ పనితనం చాలా బాగుంది. ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ బాగుంది. సినిమాలోని నిర్మాత అశ్వనీ దత్ పాటించిన ప్రొడక్షన్ వాల్యూస్ అద్భుతంగా ఉన్నాయి దర్శకుడు నాగ్ అశ్విన్ తన రచనతోనూ దర్శకత్వంతోనూ ఆకట్టుకున్నారు. పురాణాలను భవిష్యత్‌ను కలుపుతూ హై వోల్టేజ్ యాక్షన్ అండ్ ఎమోషనల్ ఎంటర్ టైనర్ గా వచ్చిన ఈ చిత్రం యూనిక్ స్టోరీ థీమ్ తో, బిగ్గెస్ట్ స్టార్ కాస్ట్ తో చాలా బాగా ఆకట్టుకుంది. ప్రభాస్ ఫ్యాన్స్ తో పాటు సాధారణ ప్రేక్షకులకు గ్రాండ్ యాక్షన్ విజువల్స్ తో పాటు ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్, మరియు అమితాబ్ యాక్షన్, కమల్ డిఫెరెంట్ లుక్, మరియు కథలోని యాక్షన్ అండ్ ఎమోషన్స కూడా చాలా బాగున్నాయి. కాకపోతే, కొన్ని యాక్షన్ సన్నివేశాలు రెగ్యులర్ గా అనిపిస్తాయి. కానీ, ఓవరాల్ గా ఈ సినిమా ఆడి యన్స్ ను బాగా ఆకట్టుకుంది. డౌట్ లేకుండా ప్రభాస్ ఫ్యాన్స్ కి ఫుల్ పూనకాలను ఇస్తోంది.




## కల్కి సీక్వెల్ పార్ట్ టైటిల్ ఇదేనా..?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన 'కల్కి 2898 AD' థియేటర్లలో ల్యాండ్ అయ్యింది. ఈ సినిమాను చూసేందుకు ప్రేక్షకులు థియేటర్లకు క్యూ కడుతున్నారు. నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసేందుకు రెడీ అయ్యింది. అయితే, ఈ సినిమా రిలీజ్ కు ముందు హీరో ప్రభాస్, దర్శకుడు నాగ్ అశ్విన్ ఇన్స్టా లైవ్ లోకి వచ్చి పలు విషయాలను పంచుకున్నారు. ఈ క్రమంలోనే కల్కి పార్ట్-2 కూడా ఉండబోతుందని వారి మాటల ద్వారా తెలిసింది. అయితే, ఈ కల్కి పార్ట్-2 కి టైటిల్ పై ఆ లైవ్ లో అభిమానులు చర్చించారు. కల్కి సీక్వెల్ పార్ట్ కి ఇంట్రెస్టింగ్ టైటిల్ ఉండాలని ఓ అభిమాని సూచించాడు. 'కల్కి 3102 BC' అయితే ఆ సీక్వెల్ పార్ట్ కి పర్ఫెక్ట్ టైటిల్ అని అతడు చెపుకొచ్చాడు.

## నార్త్ లో కల్కి విశ్వరూపం.. ఏకంగా 3వ ప్లేస్‌లో చోటు

ప్రెస్టీజియస్ పాన్ ఇండియా మూవీ కల్కి 2898 AD నేడు థియేటర్లలో రిలీజ్ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు నాగ్ అశ్విన్ పూర్తి సైన్స్ ఫిక్షన్ మూవీగా తెరకెక్కించగా, ప్రభాస్ ఈ సినిమాలో అల్ట్రా స్టైలిష్ లుక్ లో కనిపిస్తున్నాడు. కాగా, ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ లో దుమ్ములేపింది. ముఖ్యంగా నార్త్ బెల్ట్ లో హిందీ వర్షన్ లో కల్కి మూవీ ఎవరూ ఊహించని బుకింగ్స్ తో దూసుకెళ్లింది. పివిఆర్, ఐనాక్స్, సినిపోలిస్ వంటి మల్టిప్లెక్స్ థియేటర్స్ లో ఏకంగా 1,25,000 టికెట్ల విక్రయం జరిగినట్లుగా తెలుస్తోంది. 2024లో ఇది అత్యధిక టికెట్లు అమ్ముడైన చిత్రాల్లో టాప్-3 ప్లేస్ స్థానాన్ని దక్కించుకుంది. Mr. & Mrs. మహి, ఫైటర్ చిత్రాల తరువాత ఆర్టికల్ 370తో కలిసి కల్కి ఈ 3వ ప్లేస్ లో నిలిచింది. నార్త్ బెల్ట్ లో కల్కి మూవీ రూ.20-25 కోట్ల మేర ఓపెనింగ్ బిజినెస్ చేస్తుందని బిటౌన్ వర్గాలు చెబుతున్నాయి.



# ఫైనల్స్‌కు సౌతాఫ్రికా

## ఆఫ్ఘాన్‌పై ఘన విజయం



టీ20 క్రికెట్ ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా చరిత్ర సృష్టించింది. తొలిసారి ఆ జట్టు ఫైనల్స్ చేరింది. 2007లో మొదటి టీ20 ప్రపంచకప్ దక్షిణాఫ్రికా వేదికగా జరగ్గా.. ఆ సంవత్సరం భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పటివరకు 8 సార్లు టీ20 ప్రపంచకప్ జరగ్గా దక్షిణాఫ్రికా ఒక్కసారి కూడా ఫైనల్స్ చేరుకోలేదు. 2024లో సెమీఫైనల్స్‌లో ఆఫ్ఘానిస్తాన్‌పై ఘన విజయం సాధించి ఫైనల్స్ చేరింది. ఈరోజు రాత్రి ఇంగ్లాడ్, భారత్ మధ్య జరిగే రెండో సెమీఫైనల్స్ మ్యాచ్‌లో విజేతతో దక్షిణాఫ్రికా ఫైనల్స్ ఆడనుంది. ట్రినిడాడ్ వేదికగా ఆఫ్ఘానిస్తాన్, సౌతాఫ్రికా మధ్య మొదటి సెమీఫైనల్స్‌లో టాస్ గెలిచిన ఆఫ్ఘాన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఆఫ్ఘానిస్తాన్‌కు ఓపెనర్లు శుభారంభాన్నివ్వలేదు. మొదటి ఓవర్‌లోనే తొలి వికెట్ కోల్పోయిన ఆఫ్ఘానిస్తాన్ వరుసగా వికెట్లు కోల్పోయింది. అజ్మతుల్లా ఒమర్జాయ్ మాత్రమే అత్యధికంగా పది పరుగులు చేశారు. మిగిలిన బ్యాటర్లు ఎవరూ కనీసం డబుల్ డిజిట్ దాటలేదు. ముగ్గురు బ్యాట్స్‌మెన్స్ పరుగులేమి చేయకుండానే డకౌట్ చేరారు. తొలిసారి వరల్డ్ కప్ సెమీస్‌కు చేరిన ఆఫ్ఘానిస్తాన్ మరో చరిత్ర సృష్టించి ఫైనల్స్‌కు చేరుతుందని అంతా అంచనా వేశారు. కానీ సౌతాఫ్రికా బౌలర్ల దాటికి 56 పరుగులకే ఆఫ్ఘానిస్తాన్ ఆలౌటైంది. 57 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 8.5 ఓవర్లలో చేధించింది. ఒక వికెట్ నష్టానికి దక్షిణాఫ్రికా 8.5 ఓవర్లలో 60 పరుగులు చేసింది. దీంతో తొలిసారి దక్షిణాఫ్రికా టీ20 వరల్డ్‌కప్ ఫైనల్స్‌కు చేరింది.

### ఇద్దరికి మూడేసి వికెట్లు..

దక్షిణాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్, షమ్సీ చెరో మూడు వికెట్లు తీయగా.. రబడా, నోకియా చెరో రెండు వికెట్లు తీశారు. ఆఫ్ఘానిస్తాన్ బ్యాటర్లలో ఎవరూ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపోవడంతో అతి తక్కువ స్కోర్‌కే కుప్పకూలింది. ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు ఒమర్జాయ్ ప్రయత్నించాడు. కానీ, నోకియా బౌలింగ్‌లో స్టబ్స్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కెప్టెన్ రషీద్ ఖాన్ (8) కూడా ఆకట్టుకోలేక పోయాడు. నబీ (0), జనత్ (8), నూర్ అహ్మద్ (0), నవీనుల్ హక్ (2), ఫరూకీ (2*) ప్రభావం చూపించలేకపోయారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో జాన్‌సెన్, షంసీ చెరో 3 వికెట్లు తీయగా.. రబాడా, నోకియా రెండేసి వికెట్లు పడగొట్టారు.

*ఇవాళ రాత్రి 8 గంటలకు భారత్-ఇంగ్లాండ్ మధ్య సెమీఫైనల్-2 జరగనుంది. అందులో విజయం సాధించిన జట్టుతో శనివారం రాత్రి 8 గంటలకు (భారత కాలమానం ప్రకారం) దక్షిణాఫ్రికా తలపడనుంది.



సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# పేపర్ లీకేజీ నిందితులపై కఠిన చర్యలు

## పార్లమెంట్ ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు కొనసాగుతున్నాయి. కొత్తగా కొలువుదీరిన 18వ లోక్‌సభతో పాటు రాజ్యసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం ప్రసంగిస్తున్నారు. మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వ ప్రాధమ్యాలను ఆమె వివరిస్తున్నారు. తొలుత రాష్ట్రపతి భవన్ నుంచి పార్లమెంట్ చేరుకున్న రాష్ట్రపతికి గజ ద్వారం వద్ద ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఉభయ సభలనుద్దేశించి ప్రథమ పౌరురాలు ప్రసంగం చేస్తున్నారు. ఈ సందర్భంగా 18వ లోక్‌సభకు ఎన్నికైన సభ్యులను అభినందించారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలు సజావుగా జరిగాయి. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన ఈసీకి అభినందనలు. ఈ ఎన్నికల్లో ప్రజలు సుస్థిరతకు పట్టం కట్టారు. నిజాయతీని నమ్మి ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పించారు. దేశ ప్రజల విశ్వాసం గెలిచి మీరంతా (లోక్‌సభ సభ్యులు) సభకు



వచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో సభ్యులు విజయవంతమవుతారని ఆశిస్తున్నా. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి" అని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

పరీక్షల్లో పారదర్శకత ఉండాలి..

ఈ సందర్భంగా ఇటీవల నీట్, నెట్ వంటి ప్రవేశ పరీక్షల్లో వెలుగుచూసిన అక్రమాలను రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారు. "ప్రభుత్వం చేపట్టే నియామకాలు, పరీక్షల్లో పవిత్రత ఉండాలి. పారదర్శకంగా జరగాలి. పేపర్ లీక్‌లు, పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల్లో ఉన్నత స్థాయిలో విచారణ జరుగుతోంది. ఇలాంటి ఘటనల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన అవసరముంది. నీట్, తదితర పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. పేపర్ లీకేజీ నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ముర్ము తెలిపారు. సైనిక దళాల్లో స్థిరమైన సంస్కరణలు రావాలి. మన బలగాలు స్వయం సమృద్ధి సాధించాయి. రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేశాం. సైనికులకు ఒకే ర్యాంకు ఒకే పింఛను అమలు చేశాం. రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగాయి.

### రాష్ట్రపతి ప్రసంగంలోని ముఖ్యాంశాలివే..

- ప్రభుత్వం పదేళ్లలో సుస్థిర అభివృద్ధిని సాధించింది. జమ్మూకశ్మీర్‌పై శత్రువులు అంతర్జాతీయ వేదికలపై దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ, ఈసారి కశ్మీర్ లోయలో మార్పు కన్పించింది. శత్రువుల కుట్రలకు అక్కడ ప్రజలు గట్టిగా బదులిచ్చారు. ప్రజలు పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొనడం విశేషం.
- రిఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ (సంస్కరణలు, పనితీరు, మార్పు) ఆధారంగా ప్రజలు ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుంది.
- ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తోంది. చిన్న, సన్నకారు రైతుల కోసం పీఎం సమ్మాన్ నిధి కింద ఇప్పటివరకు రూ.3.20లక్షల కోట్లు ఇచ్చాం. ఆర్థిక భరోసా కోసం నేరుగా రైతుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నాం. ఈ రోజుల్లో ఆర్గానిక్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. అందుకు అనుగుణంగా భారత్ ఉత్పత్తులు అందిస్తోంది.
- ఆరోగ్య రంగంలో దేశం అగ్రగామిగా ఉంది. ఆయుష్మాన్ భారత్ అనేది గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోంది. దీంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.70 ఏళ్లు దాటిన వారందరికీ ఆయుష్మాన్ భారత్ కింద సేవలు కల్పిస్తున్నాం.
- ప్రజా సంక్షేమం కోసం అనేక సంస్కరణలు అమలు చేస్తున్నాం. మహిళల ఆర్థిక పరిస్థితులు మెరుగయ్యాయి. నారీమణుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. పెద్ద ఎత్తున మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం కల్పిస్తున్నాం. ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టాం.
- ప్రపంచ వృద్ధిలో భారత్ 15శాతం భాగస్వామ్యం అవుతోంది. అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. గ్రీన్ ఎనర్జీ సాధన దిశగా ప్రభుత్వం పనిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో వేగంగా రోడ్ల విస్తరణ జరుగుతోంది. పౌర విమానయాన రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చాం. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది.
- డిజిటల్ ఇండియా సాధనకు ప్రభుత్వం సంకల్పించింది. బ్యాంకుల క్రెడిట్ బేస్ పెంచి వాటిని బలోపేతం చేశాం.




## వినుకొండలో చెట్టును ఢీకొట్టిన కారు.. ముగ్గురి మృతి

పల్నాడు జిల్లా వినుకొండ సమీపంలోని కొత్తపాలెం వద్ద ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. అనంతపురం-గుంటూరు జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఇన్నోవా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుంటూరు జిల్లా లక్ష్మీపురానికి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానం విశ్రాంత ఉద్యోగి సోమసి బాలగంగాధర్ శర్మ(78), ఆయన సతీమణి యశోద(67), డ్రైవర్ మృతి చెందారు. బాలగంగాధర్ శర్మ కుమారుడు హెచ్‌ఎస్‌వై శర్మ, ఆయన భార్య నాగసంధ్య, వీరి పిల్లలు కార్తిక్, అనుపమ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో శర్మ, అనుపమ పరిస్థితి విషమంగా ఉందని పట్టణ సీఐ సాంబశివరావు తెలిపారు. కర్ణాటకలోని బళ్లారి నుంచి గుంటూరుకు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## తుక్కు దుకాణానికి పాఠ్యపుస్తకాలు..

### పోలీసులకు సమాచారమిచ్చిన తల్లిదండ్రులు

ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అందాల్సిన పాఠ్యపుస్తకాలు స్క్రాప్ దుకాణానికి చేరిన ఉదంతమిది. బుధవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఉట్ల కోనేరు సమీపంలోని ఓ స్క్రాప్ దుకాణంలో గత విద్యాసంవత్సరానికి సంబంధించిన 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమ పుస్తకాలు సీలు కూడా తీయకుండా ఉండటం గమనించిన కొందరు తల్లిదండ్రులు పోలీసులకు సమాచారమిచ్చారు. 45 కట్టల పుస్తకాలను పోలీసులు ఠాణాకు తరలించారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి(డీటీడీవో) కార్యాలయ ఉద్యోగి శంకర్ వాటిని విక్రయించినట్లు దుకాణం నిర్వాహకుడు తెలిపారు. డీటీడీవో కమలాకర్‌రెడ్డిని వివరణ కోరగా పుస్తకాల పక్కదారిపై పూర్తిస్థాయి విచారణ చేసి.. జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని పేర్కొన్నారు.



## బుల్ జోరు.. సెన్సెక్స్@79000

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం(జూన్ 27న) కూడా వరుసగా లాభాలతో ప్రారంభమయ్యాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీలు రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నాయి. మొదటి గంటలోనే మార్కెట్ అద్భుతమైన రికవరీని కనబరిచింది సెన్సెక్స్, నిఫ్టీ కొత్త జీవితకాల గరిష్ట స్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో సెన్సెక్స్ తొలిసారి 79,000 మార్కును దాటగా, నిఫ్టీ కూడా తొలిసారిగా 24 వేలను అధిగమించింది.ఇదే సమయంలో బ్యాంక్ నిఫ్టీ తొలిసారిగా 53,000 పాయింట్లను దాటడం విశేషం. కానీ ట్రేడింగ్ సెషన్‌లో రికార్డు గరిష్ట స్థాయికి చేరుకున్న తరువాత ఇండెక్స్‌లు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం సెన్సెక్స్ 11 గంటల నాటికి 63 పాయింట్లు, నిఫ్టీ 20 పాయింట్ల లాభంతో ఉంది.ఈ క్రమంలో అల్ట్రా టెక్ సిమెంట్, గ్రాసిమ్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, JSW స్టీల్, HUL కంపెనీల స్టాక్స్ టాప్ 5 లాభాల్లో ఉండగా, మారుతి సుజుకి, శ్రీరామ్ ఫైనాన్స్, కోల్ ఇండియా, లార్సెన్, టెక్ మహీంద్రా సంస్థల స్టాక్స్ టాప్ 5 నష్టాల్లో ఉన్నాయి. ప్రధాన సూచీలు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఈ క్రమంలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.41 శాతం, స్మాల్‌క్యాప్ 0.26 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఐటీ 0.50 శాతం పతనంతో టాప్ లూజర్‌గా నిలిచింది. మరోవైపు మీడియా, మెటల్ 0.85 శాతం, 0.59 శాతం చొప్పున పెరిగాయి. గ్లోబల్ మార్కెట్ నుంచి బలహీన సంకేతాల నేపథ్యంలో భారతీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో మొదలయ్యాయి. నిన్నటి ట్రేడింగ్ గురించి చూస్తే మార్కెట్‌లో బూమ్ కనిపించింది. జూన్ 26న, సెన్సెక్స్ 0.90 శాతం పెరిగి 78,759.40 వద్ద సరికొత్త ఆల్ టైమ్ గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో నిఫ్టీ 50 0.71 శాతం పెరిగి 23,889.90 వద్ద సరికొత్త రికార్డు స్థాయికి చేరింది. ఇక నేడు నిఫ్టీ ఫ్యూచర్స్ 72 పాయింట్లు తగ్గి 23,796 వద్ద ట్రేడవుతున్నాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్‌లో క్షీణత కనిపించింది. ఎందుకంటే యెన్‌లో బలహీనత కనిపించింది. మరోవైపు జపాన్‌కు చెందిన నిక్కీ, కొరియాకు చెందిన కోస్పి 0.94 శాతం చొప్పున క్షీణించగా, ఆస్ట్రేలియా ASX200 1.50 శాతం పడిపోయింది.

## పోలీసు కస్టడీలో మేకప్ వేసుకుని.. లిప్‌స్టిక్ రాసుకున్న పవిత్రా గౌడ



కన్నడ నటుడు దర్శన్ అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టయిన నటి పవిత్రా గౌడ ప్రవర్తన నివ్వెరపరుస్తోంది. పోలీసు కస్టడీలో ఆమె మేకప్ వేసుకుని, లిప్‌స్టిక్ రాసుకుని కన్పించిన దృశ్యాలు దుమారం రేపాయి. దీంతో పోలీసులు చర్యలు చేపట్టారు. రేణుకాస్వామి హత్య కేసులో విచారణ నిమిత్తం జూన్ 15న పవిత్రా గౌడను పోలీసులు బెంగళూరులోని ఆమె నివాసానికి తీసుకెళ్లారు. ఆ సమయంలో ఆమె ముఖానికి మేకప్ వేసుకుని, లిప్‌స్టిక్ రాసుకుంది. లోపలికి మామూలుగా వెళ్లిన ఆమె.. ఆ తర్వాత పోలీసు సిబ్బందితో కలిసి ఇంటినుంచి బయటకువస్తుండగా మేకప్‌తో నవ్వుతూ కన్పించింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ హత్యపై ఆమె ముఖంలో ఎలాంటి పశ్చాత్తాపం కన్పించకపోవడంతో పవిత్రపై నెట్టింట ఆగ్రహం వ్యక్తమైంది. పోలీసుల తీరును కూడా కొందరు నెటిజన్లు తప్పుబట్టారు.

## వైసీపీ ఎమ్మెల్సీపై అనర్హత వేటు.. కీలక ఆదేశాలు జారీ చేసిన ఏపీ హైకోర్టు



వైసీపీకి ఏపీ హైకోర్టు షాకిచ్చింది. ఎమ్మెల్సీ ఇందుకూరి రాజాపై అనర్హత వేటు పడిన నేపథ్యంలో.. ఆ స్థానం ఖాళీ అయినట్లు నోటిఫై చేయొద్దని ఎన్నికల సంఘానికి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాటు మండలి ఛైర్మన్ మోషెన్ రాజు, విప్ పాలవలస విక్రాంత్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 10వ తేదీకి వాయిదా వేసింది.పార్టీ వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై శాసనమండలి ఛైర్మన్ మోషెన్ రాజుకు.. విప్ పాలవలస విక్రాంత్ ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో వైసీపీ ఎమ్మెల్సీ రఘురాజును అనర్హుడిగా ప్రకటిస్తూ ఈ నెల 3వ తేదీన మండలి ఛైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఛైర్మన్ నిర్ణయాన్ని రఘురాజు తప్పుబట్టారు. దీనిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రఘురాజు పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ సతీమణి టీడీపీలో చేరారనే కారణంతో పార్టీ ఫిరాయింపుల కింద ఆయన్ను అనర్హుడిగా ప్రకటించారని వైసీపీ తరఫున సీనియర్ లాయర్ జంధ్యాల రవిశంకర్ హైకోర్టుకు వివరించారు. ఎమ్మెల్సీ సతీమణి తీసుకున్న నిర్ణయానికి పిటిషనర్‌ను బాధ్యుణ్ని చేయడం సరికాదని రఘురాజు తరఫున న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. కీలక ఉత్తర్వులు ఇచ్చింది.



## కార్తీ సరసన ఆషికా

నాగార్జున 'నాసామిరంగ'తో తెలుగు ప్రేక్షకుల మనసుల్ని దోచేసింది కన్నడ కస్తూరి ఆషికా రంగనాథ్. అయితే.. అవకాశాలు మాత్రం ఈ ముద్దుగుమ్మకు అనుకున్న స్థాయిలో రాలేదనే చెప్పాలి. ప్రస్తుతానికి తెలుగులో చిరంజీవి 'విశ్వంభర'లో కీలక పాత్ర పోషిస్తున్నదని సమాచారం. ఇదిలావుంటే.. ఇతర భాషల్లో అషికాకు అవకాశాలు బాగానే ఉన్నాయి. కన్నడలో రెండుమూడు సినిమాలు చేస్తున్న ఈ అందాలభామ.. తాజాగా తమిళంలో ఓ భారీ ఆఫర్‌ని దక్కించుకుంది. ఆ సినిమానే 'సర్దార్ 2'. కార్తీ కథానాయకుడిగా రూపొందిన 'సర్దార్' తమిళనాట భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఆ సినిమాకు సీక్వెల్‌గా 'సర్దార్ 2'ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు పీఎ స్ మిత్రన్. ఇందులో హీరోయిన్‌గా నటించే ఛాన్స్‌ను కొట్టేసింది అషికా రంగనాథ్. అంతేకాక, సిద్దార్థ్ హీరోగా నటిస్తున్న 'మిస్ యు' సినిమాలో కూడా నటిస్తున్నది అషికా. ఇవి విజయాలు సాధిస్తే కోలీవుడ్‌లో ఈ అందాలభామకు మంచిరోజులొచ్చినట్టే.